# వెన్నెముక

— సుస్మితారమణమూర్తి




జగన్నాథం ఆ ఆఫీసులో చేరి పదిహేనేళ్ళు పైన కావస్తోంది. ఒకప్పుడు 'లీవ్ వేకెన్సీ'లో చేరిన తను—టెంపరరీ గుమాస్తాగా చేసి—తర్వాత రెగ్యులర్ గుమాస్తాగా ఓ పదేళ్ళు చేసింతర్వాత సీనియర్ గుమాస్తాగా ప్రమోషన్ సంపాదించుకో గలిగాడు.

ఆ ఆఫీసులోని ప్రతి వ్యవహారం గురించి జగన్నాథంకి క్షుణ్ణంగా తెల్సుండటం వల్ల ఆఫీసు సూపర్నెంట్ దగ్గర్నుంచి—ఆఫీసర్ దాకా తనంటే మంచి అభిప్రాయం వుంది, గౌరవముంది, అపరాభిమానాలున్నాయ్.

జగన్నాథం ఆఫీసు రిక్రూటింగ్

సెక్షన్‌లో పన్జేస్తున్నాడు. అక్కడ టైపిస్ట్ వుద్యోగం ఒకటి ఖాళీగా వుంది. ఆ ఖాళీని భర్తీ చేయడం కోసం—ఆ ఒక్క పోస్టుకి



ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజి నుంచి వచ్చిన పదిమంది అభ్యర్థులకు ప్లస్ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులు మరో ఐదుగురికి కలిపి వెరసి పదిహేను మందికి ఆ రోజు రిటన్ టెస్ట్ జరుగబోతోంది.

ఆ పదిహేను మందిలో జగన్నాధం చుట్టం కొడుకు శ్రీహరి కూడా ఒక అభ్యర్థి.

శ్రీహరి నిరుద్యోగి. ఉద్యోగం కోసం కలవరిస్తున్న వాడు-ఎంతో కాలం నుంచి.

శ్రీహరికి ఎలాగైనా వుద్యోగం వచ్చేట్లు చేయమనీ—ఆ వుద్యోగం గనక వస్తే తమ కష్టాలు గట్టెక్కుతాయనీ—తమ కుటుంబాన్ని కష్టాల్నించి ఆదుకునే ఆపద్బాంధవుడవు నీవేననీ—నీవు తలచుకుంటే శ్రీహరికి వుద్యోగం రావడం ఏమంత కష్టం కాదనీ—అవసరమైతే నీవు నా కివ్వాల్సిన వెయ్యి రూపాయలు ఏ ఆఫీసర్కైనా ముడుపు కట్టమనీ...ఆ చుట్టం తన అవసరాన్ని-కష్టాన్ని-ఆవేదనని—జగన్నాధం గొప్పతనాన్ని-ఏకరువు పెట్టేడు.

ఆ చుట్టం మాటలకి జగన్నాధం కరిగి నీరైపోలేదు.

శ్రీహరికి ఎలాగైనా సహాయం చేయాలనుంది తనకు. ఉద్యోగానికి కావాల్సిన అర్హతలన్నీ వున్నాయ్ శ్రీహరికి. పరీక్షలో కూడా పాసవగల సమర్ధుడు శ్రీహరి.

కానీ...తెలివితేటలకి—సమర్ధతకి నిజంగా పరీక్షంటూ జరిగితే, తప్పకుండా శ్రీహరే నెగ్గి తీరుతాడన్న విషయం జగన్నాధంకి బాగా తెల్సు.

శ్రీహరికి గనక ఉద్యోగం వచ్చేట్లు తను చేయగలిగితే ఇది వరలో ఉద్యోగం ఇప్పిస్తాననిచుట్టందగ్గర తీసుకున్న వెయ్యి రూపాయలకి ఎగనామం పెట్టొచ్చు తను.

ఇదే ఉద్యోగానికి ఓ నెల క్రితం గనక ఇంటర్వ్యూ జరిగి వుంటే తప్పకుండా తననుకుంది జరిగేట్టు చేసేవాడే జగన్నాధం.

అప్పటి ఆఫీసర్ దగ్గర తన కంత చనువు-అభిమానం-పలుకుబడి వుండేవి.

ఇప్పటి ఆఫీసర్ సంగతి వేరు. వచ్చి నెల రోజులు పూర్తయినా తనతత్వం ఏవిటో ఎవరికీ అర్థం కావటం లేదు. ఎన్నోసార్లు ఆఫీసు పనిని కల్పించుకుని సంతకాల కోసం ఆఫీసరింటికి కూడా వెళ్ళాడు జగన్నాధం-ఇంటి దగ్గరయినా గురుడు సరిగ్గా మాట్లాడుతాడేవోననీ-తద్వారా తనను అర్థం చేసుకోడానికి వీలవుతుందేవోననీ. అయినప్పటికీ జగన్నాధంకి అతను అర్థం కాలేదు.

ఇలాంటప్పుడు శ్రీహరికి తనెలా ఉద్యోగం వచ్చేట్లు చేయగలడు? శ్రీహరి టెస్టులో పాసైనా అతని గురించి ఆఫీసర్కి 'రికమెండ్' చేయగల స్థితిలో లేదే తను!

ధైర్యంచేసి ఆఫీసర్కి శ్రీహరి గురించి చెప్పి చూస్తే? ఈ ఆఫీసర్కి ఇలాంటి వ్యవహారం

వచ్చకపోతే? తన మీద చెడు అభిప్రాయం కలుగుతుందేమో?? ఎన్నో ఏళ్ళనుంచి-ఎంతో మంది ఆఫీసర్ల చేత 'సెహభాష్' అన్పించుకుని 'కాన్ఫిడెన్షియల్' రిపోర్టులో ఇంద్రుడు-చంద్రుడు అని రాయించుకోగలిగినంత తన 'కెరీర్'కే మచ్చ వస్తుందేమో??

ఈ విషయంలో తను ఆఫీసర్ని సంప్రదించకూడదు. శ్రీహరికీ తనకూగల సంబంధం ఎవరికీ తెలియకుండా జాగ్రత్తపడాలి. జాగ్రత్త పడినంత మాత్రాన శ్రీహరికి ఉద్యోగం వస్తుందా? రాదే! అయితే ఎలా? శ్రీహరికి వచ్చే మార్గమేమిటి?

క్షణక్షణానికీ జగన్నాధం బుర్ర విపరీతంగా వేడెక్కిపోతుందేగాని తన సమస్యకు ఎలాంటి పరిష్కారం లభించటం లేదు.

* * *

'రిటన్ టెస్టు' లో ముగ్గురు సెలెక్టయ్యారు. ఆ ముగ్గురిలో శ్రీహరి కూడా ఒకడు. ముగ్గురిలో ఏ ఒక్కరినో అదృష్టం వరించనున్నది.

జగన్నాధానికి తెల్సిన సమాచారం ప్రకారం-తన ఆఫీసరుకి మిత్రుడయిన ఓ తహశీల్దారుగారి అభ్యర్థి చంద్రం ఆ ముగ్గురిలో వున్నాడు. చంద్రంకి ఉద్యోగం ఇవ్వడానికి ఆఫీసరుగారు సుముఖంగా వున్నట్లు-ఆ చంద్రం ద్వారా తెల్సుకున్న శ్రీహరి, తనకు ఉద్యోగం వచ్చే అవకాశం లేనందుకు జగన్నాధం దగ్గర వాపోయాడు. నిరుత్సాహపడ్డాడు. అంతవరకు ఆ ఉద్యోగం తనకు కూడా రావటానికి అవకాశం ఉన్నందుకు సంతోషపడ్డ శ్రీహరి తనకు ఉద్యోగం వస్తుందన్న ఆశకు నీళ్ళు వదిలేశాడు.

ఒక్కటే వేకెన్సీ!

శ్రీహరి - చంద్రం - సురేష్‌ల మధ్య పోటీ!

ఓరల్ ఇంటర్వ్యూ ఒక్కటే మిగిలి వుంది.

ఆ ఫార్మాలిటీ కాస్త అయిపోతే చంద్రంకి ఉద్యోగం రావడం ఖాయంలా వుంది. శ్రీహరికి ఉద్యోగం వచ్చేట్లు చేయడం ఎలా?

ఓరల్ ఇంటర్వ్యూలో కూడా రిటన్ టెస్టులోలా శ్రీహరికే మంచి మార్కులు వస్తే?......

'మార్కులు - గిర్కులతో పనేం వుందోయ్ జగన్నాధం? మీ ఆఫీసర్‌గారి దయ వుంటే చాలు. ఆ ఉద్యోగం శ్రీహరికే వస్తుంది.' జగన్నాధంలోని జగన్నాధం మందహాసం చేస్తూ అన్నాడు.

'అవును. ఆఫీసర్ తల్చుకుంటే చాలు- శ్రీహరికి వుద్యోగం వస్తుంది.'

అయితే ఆయన తల్చుకునేట్టు చేయడం ఎలా? వారితో తనకున్న పరిచయమే పాటిది? తన మనసులోని మాటను వారి చెవిలో వేయగల ధైర్యం తనకెలానూ లేదు. వారి ద్వారా తన పనిని జరిగేట్టు చేయలేదు....

అలా ఆలోచనల అలల్లో తేలుతూ మునుగుతున్న జగన్నాధంకి తనుంటున్న అద్దె ఇల్లు గుర్తుకొచ్చింది. ఆ ఇంటి యజమాని గుర్తొచ్చాడు. ఆ ఇంటి యజమానికిగల చిరకాల మిత్రుడు గుర్తొచ్చాడు. ఆ చిరకాల మిత్రుని హోదా గుర్తుకొచ్చింది. ఆ హోదాతో తన సమస్య తీరే మార్గం చీకటిలో కాంతి పుంజంలా గోచరించింది. అంతే! ఆఫీసుకి సెలవు పెట్టేసి ఆఘమేఘాల మీద అతని ఇంటి యజమాని దగ్గరకెళ్ళి అతని కాళ్ళు చేతులు పట్టుకున్నాడు. గోడు గోడున విలపిస్తూ తన గోడుని—నిస్సహాయపు పరిస్థితిని తన చెవిలో వేశాడు.

వెన్వెంటనే ఆ ఇంటి యజమాని తన చిరకాల మిత్రుని కల్సుకోడం జరిగింది. జగన్నాధం గోడుని తన గోడుగా అతని చెవిలో వేయడం జరిగింది. అతని దగ్గర్నుంచి—'మరేం ఫర్లేదు. అన్నిటికీ నేనున్నాను' అన్న హామీ సంపాదించడం జరిగింది.

విషయాన్ని ఇంటి యజమాని జగన్నాధం చెవిలో వేసి, తన చేతులు దులుపుకున్నాడు. అద్దె డబ్బులు ఇచ్చేటప్పుడు ప్రతినెలా నిసుక్కునే జగన్నాధం దృష్టిలో తన ఇంటి యజమాని నిజంగా దేవుడే అయ్యాడు. ఎప్పుడూ అభిమానంగా మాట్లాడని జగన్నాధం అమాంతంగా ఇంటి యజమానిని కౌగిలించేసుకున్నాడు. ఇదే అదననుకుని ఓ పది రూపాయలు ఇంటద్దె పెంచేశాడు అతను. తెరవెనుక జరిగిన ఈ తతంగం తెలీని శ్రీహరి ఇంక వుద్యోగం తనకు వచ్చే అవకాశం తప్పిపోయిందన్న దిగులుతోనే వున్నాడు.

ఓరల్ ఇంటర్వ్యూ జరిగింది.

ఇదివర్లా—ఓరల్ ఇంటర్వ్యూ జరిగిన్నాడే ఫలితం ప్రకటించడం ఈసారి జరుగలేదు. పది రోజులు ముందుకి జరిగాయ్.

ముగ్గురు మూర్తుల్లో శ్రీహరి అనుకున్నట్లుగా అదృష్టం చంద్రాన్ని వరించ లేదు. సురేష్ని

వరించలేదు. అదృష్టం శ్రీహరినే వరించింది.

అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకున్న శ్రీహరి ఆశ్చర్యంతో నోరు తెరిచేశాడు. సంతోషంతో వుక్కిరి బిక్కిరి అయిపోయాడు. జగన్నాధం మూలాన్నే తనకు వుద్యోగం వచ్చిందని అతనికి తన కృతజ్ఞత తెలుపుకున్నాడు. "చంద్రంకి కాకుండా తన కీ వుద్యోగం ఎలా వచ్చింది? చంద్రంది ఆఫీసర్ రికమండేషన్ కదా?" అని అడక్కుండా వుండలేక పోయాడు. జగన్నాధం జరిగింది వివరించి చెప్పేడు శ్రీహరికి—

"ఉన్నది ఒక్కటే వేకెన్సీ? ఆ ఒక్క వేకెన్సీకి చంద్రంది ఓ తహశీల్దారు ద్వారా మా ఆఫీసరు గారి రికమండేషన్? నీకా ఎలాంటి రికమండేషనూ లేదు. మిగిలింది సురేష్? నీవనుకుంటున్నట్లుగా సురేష్‌కి రికమండేషన్ లేకుండా పోలేదు. మా ఆఫీసర్‌కి బాగా పరిచయం వున్న ఓ ఎమ్. ఎల్. ఏ. గారి రికమండేషన్ సురేష్‌కివుంది.

"ఉన్న ఒక్క వుద్యోగాన్ని చంద్రం—సురేష్‌లలో ఎవరిని కాదన్నా-తన మిత్రులలో ఒకర్ని చిన్న బుచ్చినట్లుంటుందని-చివరికి ఇద్దరినీ కాదని అన్ని అర్హతలు, సమర్ధత గల నిన్నే ఆ వుద్యోగానికి ఎంపిక చేయడం జరిగింది."

శ్రీహరి సందేహం ఇంకా నివృత్తి కాలేదు.

తనకు తెల్సినంతలో తన మిత్రుడు సురేష్‌కి ఎలాంటి రికమండేషనూ లేదే? అలాంటిది అతనెలా యమ్ ఎల్. ఏ. గారి రికమండేషన్ తెచ్చుకో గలిగాడు? ఏ రికమండేషనూ లేని తనకెలా వుద్యోగం వచ్చింది?

శ్రీహరికి మనసు నిండా సందేహాలే?

తన సందేహాల నన్నింటినీ వివరంగా జగన్నాధానికి తెలియజేసి, సందేహ నివృత్తి కోసం ఆత్రంగా జగన్నాధం ముఖం వైపు చూశాడు శ్రీహరి. అంత వరకూ కళ్ళు మూసుకున్న జగన్నాధం కళ్ళు తెరిచాడు.

శ్రీహరి సందేహాలకి మందహాసంచేస్తూ ఇలా అన్నాడు—

"అవును-నిజమే? సురేష్‌కి మొదట ఎలాంటి రికమండేషనూ లేదు. తనకు నేనే ఎమ్. ఎల్. ఏ. గారి రికమెండేషన్ సంపాదించాను. ఫలితంగా ఏ రికమండేషను లేని నీకు ఉద్యోగం రావడం జరిగింది."

విషయం అర్ధమైన శ్రీహరి మరోసారి ఆశ్చర్యపోయాడు. *